నమస్తే తెలంగాణ

మెదక్

15 | హైదరాబాద్, శుక్రవారం 26 జనవరి 2024 | MEDAK

సిద్దిపేటలో గణతంత్ర వేడుకలకు సిద్ధమైన వేదిక

రిపబ్లిక్ వేడుకలకు సిద్ధం

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఆయా జిల్లాల్లో జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్లు

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఉమ్మడి మెదక్ జిల్లా ముస్తాబైంది. జిల్లా కేంద్రాల్లో రిపబ్లిక్ డే సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటలకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం కలెక్టర్లు ప్రజలను ఉద్దేశించి, సందేశాన్ని అందించనున్నారు. ఉదయం 9 నుంచి 10గంటల వరకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించనున్నారు. ఉత్తమ అధికారులకు అవార్డులు ఇవ్వనున్నారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

– నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, జనవరి 25

సాగు నీళ్లివ్వాలి..

పంటలు ఎండిపోతే ప్రభుత్వానిదే బాధ్యత

ఎల్లారెడ్డిపేటలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- రైతులు ఆందోళన చెందుతున్నారు
- బీఆర్‌ఎస్ హయాంలో కరెంటు, సాగు, తాగునీటికి ఢోకాలేదు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- తొగుట మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన

తొగుట, జనవరి 25: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎకర పొలం కూడా ఎండిపోలేదని, కరెంటు కోతలు లేవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ, లింగంపేటలో వాటర్ ప్లాంట్, ఎల్లారెడ్డిపేటలో పంచాయతీ, పెద్దమాసాన్‌పల్లిలో రైతువేదిక, పంచాయతీ, వాటర్‌ట్యాంక్, వర్ధరాజ్‌పల్లిలో పంచాయతీ, ముదిరాజ్ సంఘం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. గుడికందులలో మురికికాల్వల నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, గౌడ సంఘం భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేశారన్నారు. గత తొమ్మిదిన్నరేండ్లలో ఏనాడూ సాగు, తాగునీటికి, కరెంటుకు లోటు రాలేదన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ఫోన్ చేస్తే మల్లన్న సాగర్ జలాలు కాల్వల పొంటి పారేవన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసినా కూడవెల్లి వాగులోకి నీళ్లు విడుదల చేయలేదన్నారు. మల్లన్న సాగర్ ప్రధాన కాల్వకు సైతం మంత్రి కొండా సురేఖ రాత్రిళ్లు వెళ్లి నీటిని విడుదల చేసి స్థానిక ప్రజాప్రతినిధులను అవమానించారన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టుల ద్వారా దుబ్బాక నియోజకవర్గానికి సాగు నీటి గోస తప్పిందన్నారు. ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి, వర్ధరాజ్‌పల్లి, గుడికందుల గ్రామాల్లో దేవాలయాల్లో పూజలు చేశారు. వర్ధరాజ్‌పల్లిలో సంతోష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. గుడికందుల జడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. మల్లన్న సాగర్ ప్రధాన కాల్వను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కొమురయ్య, కంది రాంరెడ్డి, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, జ్యోతిమల్లారెడ్డి, ఎల్లం, వరలక్ష్మీ స్వామి, మల్లయ్య, రాజవ్వ, రేణుక నర్సింహులు, ఎంపీటీసీలు స్వామి, సుమలతా కనకయ్య, శరత్, మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదిలో అదే

పట్టుదల ఉండాలి

రాష్ట్రంలోనే సిద్దిపేట ప్రథమ స్థానంలో నిలవాలి

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- పదో తరగతి పరీక్షలపై విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

సిద్దిపేట, జనవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పదో తరగతిలో అదే పట్టుదల ఉండాలి.. రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలవాలి... 119 నియోజకవర్గాల్లో సిద్దిపేట వందశాతం ఫలితాలు సాధించి, నంబర్‌వన్‌గా నిలవాలి.. అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి పరీక్షలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కావద్దన్నారు. సిద్దిపేట ప్రజలు, పిల్లలకు మంచి చేయాలనేదే తన నిరంతర తపన అన్నారు. తన పిల్లలను ఎలా బాధ్యతతో చదివిస్తానో అదే విధంగా ప్రయత్నిస్తున్నానన్నారు. ఎప్పటిలాగా పదో తరగతి పరీక్షా ఫలితాలపై దృష్టి పెట్టాలన్నారు. సిద్దిపేట ప్రతిష్ఠ, గౌరవాన్ని కొనసాగించాలన్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తయి ప్రత్యేక తరగతులు మొదలయ్యాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు అన్ని మనమై అండగా ఉండాలని సూచించారు. ఇప్పటి నుంచి పరీక్షలపై ప్రణాళిక తయారు చేసుకుని ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గతేడాది సిద్దిపేట జిల్లా 98.65 ఉత్తీర్ణత సాధించిందని, రాష్ట్రంలో 2వ స్థానంలో ఉన్నామని, అందులో మన నియోజకవర్గం 98.67 శాతం వచ్చిందన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం సాధించి నియోజకవర్గం ముందుండాలని అన్నారు. నియోజకవర్గంలోని జడ్పీహెచ్‌ఎస్, మోడల్, కస్తూర్బా, రెసిడెన్షియల్ స్కూల్స్ మొత్తం 65 పాఠశాలల్లో 2,516 మంది విద్యార్థులు ఉన్నారని, అందరూ పాస్ కావాలన్నారు. తనవంతు ప్రయత్నంగా పిల్లల తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశానని.. డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిస్తున్నానని.. స్నాక్స్ కూడా తానే ఏర్పాటు చేపిస్తానన్నారు. మరింత ఆత్మవిశ్వాసం, మనో ధైర్యం నింపేలా తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు. విద్యార్థులకు అని తానై చూసుకుంటానని, వందశాతం ఫలితాల బాధ్యత మీదేనని అధికారులు, హెచ్‌ఎంలకు సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సాయంత్రం స్నాక్స్ ఏర్పాటు చేయాలని, అందుకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులు ఉండాలని, కేర్ టీచర్.. ఈ కేర్ టీచర్స్‌తో తాను 15 రోజులకు ఒకసారి మాట్లాడుతానన్నారు. ఆ టీచర్‌కు అప్పగించిన విద్యార్థులను 10/10 సాధించేలా బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి పదో తరగతి పరీక్షలు అయ్యే వరకు టీవీలు, ఫోన్లు, ఆటలు పూర్తిగా బంద్ చేసేలా చెప్పాలన్నారు. తాను పాఠశాల విజిట్ చేస్తానని, తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశానని, ఉదయం 4 గంటలకే నిద్ర లేపి చదివించాలన్నారు. ఈ ఏడాది కూడా డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిస్తామన్నారు. గతేడాది 10/10 సాధించిన విద్యార్థులకు ట్యాబ్ ఇచ్చామన్నారు. వందశాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు పారితోషకం అందజేశామని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక చొరవ చూపి రోజూ ఏదో ఒక సమయంలో పాఠశాలలను సందర్శించాలని సూచించారు. సమీక్షలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారి రామస్వామి, ఎంఈవోలు యాదవరెడ్డి, దేశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం పొందిన సర్పంచ్‌లతో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

స్వచ్ఛతలో స్ఫూర్తి

అవార్డుల్లో ఆదర్శం సిద్దిపేట

- దేశానికి స్వచ్ఛత పాఠాలు నేర్పిన చరిత్ర సిద్దిపేట సొంతం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట నియోజకవర్గ సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సత్కారం

సిద్దిపేట, జనవరి 25: ‘స్వచ్ఛత’లో స్ఫూర్తి, అవార్డుల్లో ఆదర్శం మన సిద్దిపేట. సర్పంచ్‌ల పట్టుదల, చైతన్యం అమోఘం. రాష్ట్రం ఏర్పడి తర్వాత దేశంలో తొలి ఓడీఫ్ (బహిరంగ మల విసర్జన రహిత) నియోజకవర్గం మన సిద్దిపేట’ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట రెడ్డి సంక్షేమ భవన్‌లో నియోజకవర్గ సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటకు సాగు, తాగు నీరు, గోదావరి జల కల సాకారం, జీవితంలో సంతృప్తినిచ్చిందన్నారు. చరిత్రలో నిలిచిపోయే పనులు చేశామన్నారు. మండుటెండల్లో మత్తళ్లు దుంకిన చెరువుల్లో గోదారమ్మకు స్వాగతం పలికిన గొప్ప పనిలో మీరంతా భాగస్వాములయ్యారన్నారు. నియోజకవర్గంలో 47 గ్రామాలకు అవార్డులు వచ్చాయన్నారు. 33 జాతీయ స్థాయి, 9 రాష్ట్ర స్థాయి, 5 జిల్లా స్థాయి అవార్డులు సాధించామన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీకి 17 జాతీయ అవార్డులు, గ్రామీణ ప్రాంతాల్లో 16 జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. మున్సిపాలిటీలో 5, గ్రామీణ ప్రాంతాల్లో 5 రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించామన్నారు. నియోజకవర్గంలో 46 గ్రామాలకు నిర్మల్ పురస్కార్ అవార్డులు సాధించామని ఎమ్మెల్యే తెలిపారు. దేశానికి మొదటి పౌరుడు రాష్ట్రపతి, గ్రామానికి మొదటి పౌరుడు సర్పంచ్ అన్నారు. గ్రామ అభివృద్ధిని, సంక్షేమాన్ని ముందుండి నడిపే గురుతర బాధ్యత సర్పంచ్‌దేనన్నారు. ప్రధాని, సీఎం, మంత్రి, ఎమ్మెల్యే కంటే ఒక ప్రజాప్రతినిధిగా సర్పంచ్ కొన్ని కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో పంచాయితీలు, గొడవలకు సర్పంచే పెద్దమనిషి, ఇరువర్గాలు నిత్యం కండ్ల ముందే ఉంటారు, ఎవరి వైపు తీర్పు చెప్పినా ఇంకొకరికి కంటు కావాల్సిందే, అన్నీ చక్కదిద్దుకుంటూనే మళ్లీ అభివృద్ధిని చూసుకోవాలి, అభివృద్ధి చేయకున్నా ఇబ్బందే, ఎంత కష్టపడినా నూటికి నూరు శాతం ప్రజలను సంతృప్తి పర్చలేమన్నారు. సిద్దిపేట నియోజకవర్గ సర్పంచ్‌లు ఆల్ రౌండర్లు, అన్ని పనుల్లోనూ యాక్టీవ్‌గా ఉంటారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉన్నారని, ఆ సమయంలో చనిపోతే దహన సంస్కారాలను ధైర్యంగా చేయించారన్నారు. పదవీ వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటీ రోజారాధాకృష్ణ శర్మ, ఎంపీపీలు మాణిక్యరెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాయకులు జాప శ్రీకాంత్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రామచంద్రం, కమలాకర్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

‘పీఎం విశ్వకర్మ’తో రుణం సులభం

పవర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అధికారులు

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వరం
- పీఎం విశ్వకర్మ పథకంపై కాన్ఫడిరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ తరగతులు
- సులభంగా రూ.లక్ష ఆర్థిక సాయం
- 18 రంగాలపై ఉచిత నైపుణ్య శిక్షణ

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయంతో కూడిన ప్రోత్సాహం, నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ అందించడమే లక్ష్యంగా పీఎం విశ్వకర్మ పథకం తోడ్పడుతుందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. తెలంగాణ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ స్కీంపై ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన ఎంఎస్‌ఎంఈ, పలు చేతివృత్తిదారులు, కోవే ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులు, చేతివృత్తులను పరిరక్షించడమే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకం స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ, చిన్న, మధ్య తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సాయపడుతుందన్నారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి స్కీంలో పేర్కొన్న వృత్తులకు ప్రత్యేక శిక్షణతో నైపుణ్యాలు పెంపొందిస్తారన్నారు. శిక్షణ కాలానికి రోజుకు రూ.500 స్టైఫండ్, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. ఆధార్, ఆధార్ అనుసంధానం చేయబడిన మొబైల్ నంబర్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లోనే ఎంపిక పూర్తవుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్‌లోనూ ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి మూడు దశల్లో శిక్షణా కార్యక్రమాలు, బ్యాంకు లోన్ ఫెసిలిటీ, సర్టిఫికెట్ వంటివి అందజేస్తారని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకంలో పేర్కొన్న కులవృత్తుల వారు మాత్రమే అర్హులని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సరైన వేదిక అవుతుందన్నారు. దరఖాస్తు విధానం, కావాల్సిన దరఖాస్తులు, ఈ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోవే తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ చేతన జైన్, జీఎం డీఐసీ ప్రీతిపవన్ కుమార్, ఎంఎస్‌ఎంఈ అధికారులు శ్రీనివాసరావు, కో వే ఇండియా సలహాదారు కరుణా గోపాల్, కో వే వైస్ ప్రెసిడెంట్ కల్పనారావు, సెక్రటరీ నీరజా గోదావర్తి, కోశాధికారి నిషా అగర్వాల్, జాయింట్ సెక్రటరీ అనురాధ కారటీ, నాయీ బ్రాహ్మణ సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ రామలింగంచారి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు భారీ ఆదాయం

- ఆలయంలోని 23 హుండీల లెక్కింపు
- 43 రోజుల్లో రికార్డు స్థాయిలో ఆదాయం
- ఆదాయం రూ.కోటీ 39 లక్షలు

నగదు లెక్కిస్తున్న శివరామకృష్ణ సేవా సమితిభజన మండలి సభ్యులు

చేర్యాల, జనవరి 25: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది. గతంలో ఎన్నడూలేని విధంగా హుండీ ఆదాయం రూ.1,39,77,230 సమకూరింది. ఆలయంలోని 23 హుండీలను మహా మండపంలో ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో గురువారం లెక్కించారు. అర్చకులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు మొత్తం 230 మందితో హుండీలను లెక్కించారు. గతేడాది డిసెంబర్ 12న 62 రోజుల లెక్కింపులో రూ.69,08,932 నగదు, 20 గ్రాముల మిశ్రమ బంగారం, 6,500 గ్రాముల మిశ్రమ వెండి సమకూరింది. తాజాగా నిర్వహించిన లెక్కింపులో రూ.1,39,77,230 నగదు, 68 గ్రాముల మిశ్రమ బంగారం, 14కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి, 25 క్వింటాళ్ల బియ్యం, 15 విదేశీ కరెన్సీ లభించింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 43 రోజుల్లో భారీ ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదును ఏపీజీవీబీలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, చీపురు భిక్షపతి, అల్లం శ్రీనివాస్, తాళ్లపల్లి రమేశ్, పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, అంబాల ఉమారాణి శ్రీనివాస్, కాయితా మోహన్‌రెడ్డి, ఏఈవో గంగా శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన

బాధ్యత అందరిదీ

- ఓటరు నమోదులో బీఎల్‌వోల సేవలు భేష్
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

మెదక్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) / మెదక్ మున్సిపాలిటీ: స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధితో కూడిన సుస్థిర ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఓటుతోనే సాధించుకోగలమని, అలాంటి ఓటరు డే ను మనందరం పండుగలా నిర్వహించుకోవడం హర్షణీయమని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం పోస్టాఫీస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన ఓటరు చైతన్య ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2011 సంవత్సరం జనవరి 25వ తేదీన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన సందర్భంగా ప్రతి ఏడాది ఇదేరోజును జాతీయ ఓటరు దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. జిల్లాలో అర్హులైన వారందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ‘స్వీప్’ విస్తృతంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. నూతన ఓటర్లకు కలెక్టర్ రాజర్షి షా ఎపిక్ కార్డులు అందజేశారు. అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్‌డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ హర్దీప్ సింగ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, విద్యార్థులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

గత కేసీఆర్ సర్కార్ తండాలను పంచాయతీలు చేసింది

- మోతిమాత ఆలయాభివృద్ధికి మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి
- జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- మోతిమాత జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు



ఉప్పర్‌పల్లి తండాలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్, జనవరి 25 : గిరిజనులను అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసి, మీ తండాల్లో మీ పాలన తీసుకువచ్చారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. గురువారం మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలో జరిగిన మోతిమాత జాతరలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలకు పంచాయతీలుగా గుర్తింపునిచ్చి సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించిందన్నారు. కల్యాణ లక్ష్మీ పథకం ప్రవేశపెట్టి ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థిక సాయం అందించిందన్నారు. గిరిజనుల కోసం హైదరాబాద్‌లో బంజారా భవన్ నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సేవాలాల్ జయంతిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. మోతిమాత ఆశీస్సులతో గిరిజన తండాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరుకు హామీ ఇచ్చారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మోతిమాత ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు దేవాలయ ఎంతో కృషి చేశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు, తాగునీరు, రోడ్లు, సామూహిక భవనం నిర్మించామన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు.

భారీగా వచ్చిన భక్తులు

మోతిమాత జాతరకు గిరిజనులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో గిరిజనుల గురువు గోవింద్ మహారాజ్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, టెలికాం బోర్డు సభ్యులు, సజ్జారావుపేటతండా సర్పంచ్ పవార్ శంకర్‌నాయక్, దేవాలయం కమిటీ సభ్యులు గోపాల్, రాంశెట్టి, దేవిదాస్ జాదవ్, శ్రీనివాస్‌నాయక్, వాసునాయక్, హీర్ రాథోడ్, బీఆర్‌ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, తట్టు నారాయణ, జైపాల్‌నాయక్, సంజీవ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

- సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
- ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది: ఎస్పీ రూపేశ్

సంగారెడ్డిలో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి ప్రభాకర్ రావు, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు అన్నారు. ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన సుచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జాతీయ ఓటర్ల దినోత్సవానికి నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రాంతాలు, కులాలు, మతాల వారు సామూహికంగా జరుపుకొనే పండగ ఓటరు దినోత్సవమన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటేయాలి

ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 14,24,123 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 43,834 మంది 18 నుంచి 19 ఏండ్ల యువ ఓటర్లు ఉన్నారన్నారు.

ఓటు విలువ చాలా గొప్పది

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా గొప్పదని జిల్లా ఎస్పీ రూపేశ్ తెలిపారు. 2011 జనవరి 25న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటైందని, ఈ సందర్భంగా ఏటా జాతీయ ఓటు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసే అవకాశం ఉన్నదన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లు, యువ ఓటర్లను ఘనంగా సన్మానించారు. బీఎల్‌వోలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు స్థానిక ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ఓటరు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.